క్లుప్తంగా

వీధి దీపాల నిర్వహణను పర్యవేక్షించాలి



వార్డుల్లో సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్

నరసాపురం: పట్టణంలో వీధి దీపాల నిర్వహణ సవ్యంగా సాగేలా పర్యవేక్షణ చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి వార్డుల్లో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాల సమస్యలను పలువురు కమిషనర్ దృష్టికి తీసుకురాగా, ఆయన అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అలాగే వార్డుల్లో ఎక్కడా పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలి

మొగల్తూరు: అధికారులంతా సమన్వయం చేసుకుని ప్రజల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కె.రాజకిషోర్ సూచించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత శాఖ అధికారితో పాటు వివిధ శాఖల అధికారులను సమన్వయం చేసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పోలీస్, పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

లలితాదేవికి చతుష్షష్టి ఉపచార పూజ



చతుష్షష్టి ఉపచార పూజ చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: వాయు త్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శివదేవునిచిక్కాలలోని శ్రీ పార్వతీ సమేత శ్రీ శివదేవస్వామి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని లలితాదేవికి చతుష్షష్టి ఉపచార పూజ నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. గ్రామంలోని సువాసినీలు పెద్ద సంఖ్యలో పాల్గొని లలితా సహస్రనామ పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు చేశారు. ర్యాలి శివాజీ బ్రహ్మత్వంలో అమ్మవారికి పూజలు చేశారు.

నేడు మొగల్తూరులో సత్యనారాయణస్వామి వ్రతాలు

మొగల్తూరు: కార్తీక మాసం నేపథ్యంలో స్థానిక రాజగోపాలస్వామి వారి ఆలయంలో గురువారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు సుదర్శనం లక్ష్మీ నరసింహమాచార్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సామూహిక వ్రత కార్యక్రమంలో పెద్ద ఎత్తున దంపతులు పాల్గొనాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఉండి: తల్లి మందలించడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండిలోని గణపవరం రోడ్డులో నివాసముంటున్న బైరపోగు మధుకుమార్ (22) పెయింటింగ్ పని చేస్తూ జీవిస్తున్నాడు. అయితే కొంతకాలం నుంచి పెయింటింగ్ పనికి వెళ్లకపోవడంతో అతని తల్లి మందలిస్తూ ఉండేది. ఈ నెల 21వ తేదీన కొత్త బట్టలు కొనుక్కుంటానని తనకు డబ్బులు ఇవ్వాలని తల్లిని అడగడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో 22వ తేదీ మధ్యాహ్నం ఇంటి వద్దనే గడ్డి మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే అతనిని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 26వ తేదీ ఉదయం ఏడు గంటలకు మృతి చెందాడు. మృతుడి తల్లి శ్రీదేవి ఫిర్యాదు మేరకు ఏఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

ఉండి: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ప్రముఖపాత్ర వహిస్తాయని ఎస్సై ఎండీ నసీరుల్లా అన్నారు. బుధవారం సీసీ కెమెరాల ఏర్పాటుపై ఉండి, చెరుకువాడ, అర్తమూరు, ఎన్నార్పీ అగ్రహారం, కలిసిపూడి, పెదపుల్లేరు గ్రామాల్లో సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బందితో సమావేశాలు నిర్వహించి సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చెరుకువాడలో సర్పంచ్ కొండవేటి సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎస్సై నసీరుల్లా మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న నేరాలు త్వరితంగా పరిష్కారం కావాలంటే సీసీ కెమెరాల ఏర్పాటు చాలా ముఖ్యమన్నారు. ప్రధాన కూడళ్లలో, వీధుల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

వృద్ధుల ఆరోగ్యానికి భరోసా

- ఆయుష్మాన్ భారత్ ద్వారా 70 ఏళ్లు పైబడిన వారికి ఉచిత ఆరోగ్య బీమా
- ఏడాదికి రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం
- నియోజకవర్గంలో 15 వేల మంది వృద్ధులకు లబ్ధి

యలమంచిలి: వయోవృద్ధులకు ప్రాణాంతక వ్యాధులు వస్తుంటే కుటుంబ సభ్యులు ఖర్చు పెట్టి వైద్యం చేయించడానికి వెనకాడుతున్న రోజులివి. అదే సమయంలో ఇన్సూరెన్స్ కంపెనీలు కూడా వయోవృద్ధులకు పాలసీలు ఇవ్వడం లేదు. కొన్ని కంపెనీలు ఇస్తున్నా వాటి ప్రీమియం పెద్ద మొత్తంలో ఉంటుంది. ఇలాంటి సమయంలో వయోవృద్ధులు జబ్బు చేసి ఆసుపత్రుల పాలైతే వారి జీవితాంతం కష్టపడి కూడబెట్టుకున్నదంతా కరిగిపోతుంది. ఖరీదైన వైద్యం కారణంగా అప్పుల పాలైన కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో 70 ఏళ్లు నిండిన వృద్ధులందరికీ ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) కింద ఉచితంగా ఆరోగ్య బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఇప్పటి వరకు ఈ పథకం కింద పేద, తక్కువ ఆదాయ వర్గాలకే ఉచిత ప్రయోజనం అందుతుంది. ఇక పై ఆర్థిక పరిస్థితులకు సంబంధం లేకుండా 70 ఏళ్లు నిండిన వృద్ధులు పీఎంజేఏవై కింద రూ.5 లక్షల నగదు రహిత హెల్త్ కవరేజీ లభిస్తుంది.

70 ఏళ్లు పైబడిన వారందరికీ ఉచిత బీమా

పీఎంజేఏవై పథకాన్ని 2018లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. పేద తరగతి కుటుంబాలకు ఈ పథకం కింద ఆరోగ్య సేవలు అందుతున్నాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ ఆర్థిక పరిస్థితులకు సంబంధం లేకుండా రూ.5 లక్షల ఆరోగ్య బీమా అందుబాటులో తెచ్చింది. అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరడానికి మూడు రోజుల ముందు వరకు అయ్యే వైద్య పరమైన ఖర్చులకు సైతం నగదు రహిత కవరేజీ ఉంటుంది. చికిత్స సమయంలో మందులు ఉచితంగా అందిస్తారు. గుండె సంబంధింత వ్యాధులకు అమర్చే స్టెంటులు, ఐసీయూ, జనరల్ వార్డులో ఉండి పొందే చికిత్సకు బీమా వర్తిస్తుంది. రోగికి చికిత్స సమయంలో ఉచితంగా భోజనం అందిస్తారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత 15 రోజుల పాటు చికిత్సకు అయ్యే ఖర్చులకు చెల్లింపులు అందుతాయి.

15 వేల మంది లబ్ధిదారులు

70 ఏళ్లు నిండి, ఆధార్ కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథకం కింద రూ.5 లక్షల హెల్త్ కవరేజీకి అర్హులు. పాలకొల్లు నియోజకవర్గంలోని పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల్లో 15,414 వేల మంది 70 ఏళ్లు నిండిన వృద్ధులు ఉన్నట్లు వైద్యారోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. వీరందరూ పీఎంజేఏవై పథకానికి అర్హులని చెబుతున్నారు. ఈ పథకం కింద ఇప్పటికే వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించి ఆయుష్మాన్ కార్డులు జారీ చేశారు. కార్డులు మంజూరు కాని 70 ఏళ్లు నిండిన వృద్ధులు ఉంటే సంబంధిత వెబ్‌సైట్ ద్వారా అప్లయ్ చేసుకుని, ఆయుష్మాన్ కార్డు పొందవచ్చని అధికారులు వివరిస్తున్నారు.



ఆయుష్మాన్ భారత్ కార్డు

సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పీఎంజేఏవై ఆరోగ్య బీమాను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే పేదలందరికీ ఈ పథకం కింద రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూరుతోంది. వీరందరికీ ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించి కార్డులు జారీ చేశాం. తాజాగా ఆర్థిక, ఆదాయ పరిస్థితులకు సంబంధం లేకుండా 70 ఏళ్లు నిండిన వృద్ధులకు ఈ పథకం వర్తింపజేస్తున్నారు.

– డాక్టర్ వర్ధనపు సుభాష్‌చంద్ర స్వరూప్, డిప్యూటి డీఎంహెచ్‌ఓ

ఆకట్టుకున్న ఏకాంబరేశ్వరుని అలంకరణ



పట్టణంలోని 12వ వార్డులో ఉన్న ఏకాంబరేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కార్తీకమాసం పురస్కరించుకుని స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. డ్రైఫ్రూట్స్‌తో స్వామివారిని అలంకరించడంతో పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– నరసాపురం

ఆధ్యాత్మిక జీవనంతో మానసిక ప్రశాంతత

పాలకొల్లు అర్బన్: ఆధ్యాత్మిక జీవనం సాగించడం ద్వారానే మానసిక ప్రశాంతత లభిస్తుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పట్టణంలోని బంగారువారి చెరువుగట్టులో వేంచేసియున్న శ్రీ మావూరమ్మను బుధవారం గుడాల గోపి దర్శించుకున్నారు. కార్తీకమాసం పురస్కరించుకుని ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. భక్తులకు ప్రసాదాలు వడ్డించారు. ఆయనతో పాటు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, ఆలయ కమిటీ అధ్యక్షుడు శంకరాపు శ్రీనివాస్, మునిసిపల్ కౌన్సిల్ మాజీ వైస్ చైర్మన్ కర్నేన రోజారమణి, కర్నేన గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.



మావూరమ్మ సన్నిధిలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

ఏఎస్ఎన్ఎం కళాశాలలో చిత్ర లేఖన పోటీలు



ఫేస్ పెయింటింగ్‌తో రెడ్ రిబ్బన్ క్లబ్ విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: ఏపి కమిషనరేట్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ మంగళగిరి వారి ఆదేశాల ప్రకారం కళాశాల అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. మొదటి రోజు పేపర్ పెయింటింగ్, రెండవ రోజు పెన్ పెయింటింగ్ కాంపిటేషన్స్ నిర్వహించారు. బుధవారం ఫేస్ పెయింటింగ్ కాంపిటేషన్‌లో భాగంగా విద్యార్థులు ఎరుపు రంగు రాసుకుని ఎయిడ్స్ వ్యాధి సోకిన వారిపట్ల వివక్ష తొలగించాలని ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు ప్రదర్శించిన పెయింటింగ్‌ల వల్ల సమాజంలో ఎయిడ్స్ మహమ్మారి నుంచి ప్రజలను అప్రమత్తం చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా 2030 నాటికి ఎయిడ్స్‌ను పూర్తిగా నివారించగలమా అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పూలపల్లి గౌతమి కళాశాల, పాలకొల్లు ఏఎస్ఎన్ఎం జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఆచంట ఎంవిఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఆచంట కళాశాల విద్యార్థి టి.జస్టిన్, గౌతమి కళాశాల విద్యార్థిని బి.తేజశ్రీ, ఏఎస్ఎన్ఎం జూనియర్ కళాశాల విద్యార్థిని టి.లావణ్య ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, ఎం.రామకృష్ణ, కె.భద్రాచలం, యామిని, పి.శ్రీనివాసరావు, పిజ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

నరసాపురం: పురుగు మందు తాగి వ్యక్తి మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు నరసాపురం టౌన్ సీఐ యాదగిరి చెప్పారు. పట్టణంలోని 22వవార్డు కొత్తకాలనీకి చెందిన కె.గిరి నాయుడు(61) తాపీ పని చేసుకుని జీవిస్తుంటాడు. ఇటీవల మద్యానికి బానిసై మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. ఈనెల 23వతేదీ సాయంత్రం పని ముగించుకుని ఇంటికి వచ్చి పడిపోగా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పురుగుమందు సేవించినట్టుగా వైద్యులు గుర్తించి, మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్టు సీఐ వివరించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

పాలకొల్లు అర్బన్: రానున్న నాలుగు రోజుల్లో బంగాళా ఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని రైతులంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు సూచించారు. పాలకొల్లు మండలంలోని ఆగర్రు, ఆగర్తిపాలెం, చింతపర్రు, ఉల్లంపర్రు గ్రామాల్లో బుధవారం పర్యటించారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించే ప్రయత్నంలో ఉన్న రైతులతో ఆయన మాట్లాడారు. మండలంలోని 9024 ఎకరాల్లో సార్వా మాసూళ్లు చేయగా ఇప్పటివరకు 1520 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని ఏవో రాజశేఖర్ ఆయనకు వివరించారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: మండలంలోని పలు ప్రాంతాల్లో బుధవారం వివిధ దశల్లో వరి పంటను ఒబ్బిడి చేసే పనుల్లో రైతులు తలమునకలయ్యారు. ఈ నేపథ్యంలో ఒబ్బిడి చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేశారు. వ్యవసాయ శాఖ ఏడీ ఈదా అనిలకుమారి, ఏఓ జాన్సన్‌ల నేతృత్వంలో బృందాలుగా గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో పర్యటించారు. రైతులు ధాన్యం తడవకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆచంటలో..

పెనుగొండ: ఆచంట మండలంలోని ఆచంట, శేషమ్మ చెరువు ,పెనుమంచిలి, కొడమంచిలి గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి తహసీల్దార్ పర్యటించారు. వ్యవసాయ అధికారి బి.నాగరాజు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంపై రైతులు అందరూ అప్రమత్తం గా ఉండాలని ,వరి కోతలు పూర్తి చేసుకుని కల్లాలపై ఉన్న ధాన్యాన్ని రైతులు త్వరితగతిన మిల్లులకు చేరవేయాలని సూచించారు. తహసీల్దార్ జి.కనకరాజు మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో కలిపి సుమారుగా 1,80,000 గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని, ధాన్యం తోలిన రైతులకు 48 గంటలలో ధాన్యం సొమ్ములు జమ చేస్తున్నామని తెలిపారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

యలమంచిలి: రాబోయే నాలుగు రోజులు అధికంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి కోరారు. పెనుమర్రు, మేడపాడు గ్రామాలలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె రైతులతో మాట్లాడారు. ఇప్పటికే కోతలు కోసిన రైతులుంటే ధాన్యాన్ని కల్లాల్లో ఉంచవద్దని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మల్లుల చైతన్య, కె.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పాలకొల్లు అర్బన్ రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు



పెనుగొండ: ఆచంట మండలంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు



నరసాపురం రూరల్: లక్ష్మణేశ్వరంలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ ఈదా అనిలకుమారి

రేపు నరసాపురం కౌన్సిల్ సమావేశం

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని స్పష్టం చేశారు. సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



పాలకొల్లు అర్బన్: మునిసిపల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, అంగన్‌వాడీ వర్కర్లు



యలమంచిలి: చించినాడ హైస్కూల్లో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

పాలకొల్లు అర్బన్: బాల్య వివాహ రహిత ఏపీగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని మునిసిపల్ కమిషనర్ విజయసారథి పిలుపునిచ్చారు. పాలకొల్లు మునిసిపల్ కార్యాలయంలో బాల్య వివాహ ముక్తి భారత్ కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. మునిసిపల్ కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం అంగన్‌వాడీ, ఏఎన్ఎం, ఆశ వర్కర్లతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సీహెచ్ ఇందిర, సూపర్‌వైజర్లు పులఖండం సత్యవేణి, ఎస్.మంగ తదితరులు పాల్గొన్నారు.

చించినాడలో...

యలమంచిలి: బాల్య వివాహాల వల్ల యువత తమ కలలను సాకారం చేసుకునే అవకాశం కోల్పోతారని చించినాడ సర్పంచ్ దంగేటి రాజమణి అన్నారు. బాల్య వివాహరహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా చించినాడ హైస్కూల్లో బుధవారం విద్యార్థినులతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ రాజమణి మాట్లాడుతూ బాల్య వివాహాలు సాంఘిక దురాచారమన్నారు. బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ సాకారానికి కృషి చేస్తామని బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బి.రజనీ, కె.భారతి, జి.సత్యజ్యోతి, ఎస్.సుజాత తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణేశ్వరంలో..

నరసాపురం రూరల్: బాల్య వివాహ రహిత భారత దేశమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని న్యాయవాది తానుకొండ సంతోష్‌కుమారి అన్నారు. ఉన్నత న్యాయ స్థానాల ఆదేశాల మేరకు నరసాపురం న్యాసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మొగల్తూరు గ్రామంలోని దయాళ్‌దాస్ పేటలో న్యాయ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తున్న తల్లిదండ్రులకు, ప్రోత్సహిస్తున్న వారికి చట్టపరమైన శిక్షకు గురవుతారన్నారు. సోషల్ మీడియా ప్రభావం బాల్య వివాహాలపై చాలా ఉంది కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను గమనిస్తూ ఉండాలని, విద్య, క్రీడల పట్ల ఆశక్తి కలిగేలా వారిని ఆకర్షితులుగా చేయాలన్నారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్ కె.శిరీష, పారా లీగల్ వలంటీర్ డి.వరలక్ష్మి, మహిళా పోలీస్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

1న ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

పాలకొల్లు సెంట్రల్: పేద ప్రజలకు ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలనే సంకల్పంతో డిసెంబర్ 1న నియోజకవర్గ స్థాయిలో మెగా ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్ రాజు అన్నారు. బుధవారం స్థానిక కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గాంధీరాజు మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో పేద ప్రజలకు వైద్య సదుపాయాలు అందించాలనే ఉద్దేశంతో కాస్మో క్లబ్, క్షత్రియ సంక్షేమ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 1న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ క్షత్రియ సంక్షేమ పరిషత్ కల్యాణ మండపంలో నిర్వహించే ఈ క్యాంప్‌కు వచ్చే ప్రజల కోసం గ్రామాల్లో బస్సుల సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా మహిళలకు రొమ్ము, గర్భాశయంలకు స్క్రీనింగ్ ద్వారా క్యాన్సర్ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో తిల్లపూడి, కాపవరం, కొణితివాడ, జిన్నూరు, మట్టపర్రు, పోడూరు, వద్దిపర్రు, కలగంపూడి, ఆగర్రు, దొడ్డిపట్ల గ్రామాల్లో బస్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ క్యాంపులో క్యాన్సర్‌తో పాటు చర్మవ్యాధులు, ఎముకలు, కిడ్నీ, నరములకు సంబందించిన వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. మమోగ్రఫీ, ప్యాప్‌స్మియర్, ఇసిజి, ర్యాండమ్ బ్లడ్ సుగర్, బీపీ, జనరల్ పరీక్షలు ఉచితంగా చేస్తారని వివరించారు.



కరపత్రం విడుదల చేస్తున్న గాంధీరాజు

108లో మహిళకు ప్రసవం

పెనుమంట్ర: మండలంలోని పాలమూరు గ్రామానికి చెందిన ఉప్పుల అరుణదేవి(24) బుధవారం పురిటి నొప్పులతో బాధపడడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పెనుమంట్ర 108 వాహనసిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ప్రసవ వేదన పడుతున్న మహిళను 108 వాహనంలో పెనుమంట్ర పీహెచ్‌సీకి తరలిస్తుండగా బ్రాహ్మణచెర్వు సాయినాథ్ వాటర్ ప్లాంట్ సమీపానికి వచ్చేసరికి పురిటి నొప్పులు ఎక్కువకావడంతో 108 టెక్నీషియన్ సిహెచ్ బాలకృష్ణ, పైలట్ జి.వెంకట్రావు సహాయంతో పురుడుపోయగా అంబులెన్స్‌లోనే ఆడశిశువుకు జన్మించింది. అనంతరం తల్లి, శిశువును పెనుమంట్ర పీహెచ్‌సీకి తరలించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉండటంతో 108 వాహనంలో సుఖప్రసవం చేసిన సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



108 వాహనంలో ప్రసవించిన మహిళ

ఎక్సైజ్ దాడుల్లో నిందితుడి అరెస్టు

కాళ్ల: అనుమతులు లేకుండా అనధికారంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆకివీడు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కాళ్ల మండలం పెదఅమిరంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. భీమవరం ఈఎస్టీఎఫ్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో అనధికారంగా మద్యం అమ్ముతున్న కోటపల్లి సుబ్బరాజును అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి ఆరు క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆకివీడు ఎక్సైజ్ ఎస్సై వి.కరుణప్రియ తెలిపారు.

ఉద్దరాజు రామానికి ఘన నివాళి

పాలకొల్లు అర్బన్: జిల్లా కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నేతగా, రైతుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన ఉత్తమ పార్లమెంటేరియన్ ఉద్దరాజు రామం అని మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ అన్నారు. పట్టణంలోని సమతా భవనంలో బుధవారం ఉద్దరాజు రామం వర్ధంతి సందర్భంగా రామం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజగోపాల్ మాట్లాడుతూ కాళీపట్నం భూముల విషయంలో రాజీలేని పోరాటం చేశారని గుర్తు చేశారు. కన్వీనర్ జవ్వాది శ్రీనివాసరావు, యాకల రాము, అరటకట్ల నారాయణమ్మ, వై అజయ్‌కుమార్, డి రోజామణి, జె లక్ష్మి, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆచంటలో..

పెనుగొండ: కామ్రేడ్ ఉద్దరాజు రామం ఆశయ సాధనకు కృషి చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సీపీఎం మండల కార్యదర్శి పి.మోహన్ రావు అన్నారు. కామ్రేడ్ రామం వర్ధంతిని ఆచంట సీపీఎం కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సిర్రా నరసింహమూర్తి, తలుపురి బుల్లబ్బాయి, కుసుమ జయరాజు, ఎస్‌వీఎస్ శర్మ, సీనియర్ నాయకులు తోటపల్లి సత్యనారాయణ, కొండేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఉద్దరాజు రామం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు